క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడిగా శివప్రసాద్



బాడంగి: వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడిగా మండలంలోని ముగడ గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ కార్యకర్త యామలి శివప్రసాద్‌ను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడగా, విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా ఆయనకు శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఎంతో నమ్మకం ఉంచి, ఈ పదవి కట్టబెట్టారని పార్టీ మరింత బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని శివప్రసాద్ తెలిపారు.

'ఉపాధి' నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం



ఐసీడీఎస్ కార్యాలయం వరకు కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డు

బాడంగి: మండల కేంద్రంలోని సంతతోట ఎదురుగా రాజాం రోడ్డు నుంచి ఐసీడీఎస్ కార్యాలయానికి ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ.15 లక్షల నిధులతో 315 మీటర్ల పొడవు, 12.5 మీటర్ల వెడల్పు విస్తీర్ణంలో జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు ఆధ్వర్యంలో ఈ నిర్మాణం చేసినట్లు పీఆర్ జేఈ రమేష్ పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



దీపారాధన చేస్తున్న మహిళా భక్తులు

బొబ్బిలిరూరల్: మండలంలోని పెంట గ్రామంలో ఉన్న అన్నపూర్ణ సహిత నగిరేశ్వర స్వామి ఆలయంలో హోలీ పౌర్ణమి పూజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధర్మ ప్రచారక్ ధూపం వాసు ఆధ్వర్యంలో మహిళా భక్తులు దీపారాధన చేశారు. దీపం అనేది మనలోని అజ్ఞానమనే అంధకారం తొలగించి, జ్ఞానమనే వెలుగును ప్రసాదించేదన్నారు.

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న దృశ్యం

సంతకవిటి: మండలంలోని మందరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఔదార్యం చాటుకున్నారు. తమతో పాటు చదువుకున్న ఇదే మండలంలోని అప్పలాగ్రహారం గ్రామానికి చెందిన కూన బాలకృష్ణ అనారోగ్యానికి గురై, విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న అతడి స్నేహితులంతా చందాల రూపంలో సేకరించిన రూ.30 వేలను బాలకృష్ణకు శుక్రవారం అందజేశారు. వారు చేసిన ఆర్థికసాయానికి బాలకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

రైతులను వేధించడం తగదు

బొబ్బిలి: నోటీసులు ఇచ్చి రైతులను వేధించడం సరికాదని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మంనాయుడు అన్నారు. రైతులు రుణాలు సకాలంలో చెల్లించకపోతే కోర్టుకు రావాల్సి ఉంటుందని కేంద్ర ప్రభుత్వం నోటీసులు పంపిస్తున్న నేపథ్యంలో ఆయన స్థానిక పట్టణంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. కార్పొరేట్ వ్యక్తులు, సంస్థలకు ఇచ్చిన వేల కోట్లు, లక్షల కోట్ల రూపాయలను కేంద్రం మాఫీ చేస్తోందని, అయితే రైతులకు ఇచ్చిన రుణాలు మాత్రం తప్పనిసరిగా చెల్లించాలని ఒత్తిడి చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. రైతులకు న్యాయం చేయాల్సింది పోయి ఇలా హింసించడం తగదన్నారు.

సారా రహిత గ్రామాలే లక్ష్యం

బొబ్బిలి: సారా రహిత గ్రామాలే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ పామోటి చిన్నంనాయుడు తెలిపారు. స్థానిక పట్టణంలోని పలు కూడళ్లలో సారా నిర్మూలన ప్రధానంగా రూపొందించిన నవోదయం స్టిక్కర్లను శుక్రవారం అతికించారు. అనంతరం సారా వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. సారా తాగితే అనారోగ్యపాలవ్వడం ఖాయమని, ఒక్కోసారి ప్రాణాంతకమన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బొబ్బిలిరూరల్: మహిళలకు కుట్టుమిషన్ శిక్షణకు సంబంధించి, దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో పి.రవికుమార్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఆసక్తి ఉన్న అన్నివర్గాల మహిళలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, తెల్లరేషన్‌కార్డు ఉన్నవారంతా అర్హులేనన్నారు. మరిన్ని వివరాలకు వెలుగు కార్యాలయంలో సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

సప్తవర్ణ శోభితం.. హోలీ సంబరం!

వాడవాడలా హోలీ సందడి శుక్రవారం నెలకొంది. సామాజిక ఐక్యత, ఆనందం, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ రంగుల వేడుకను ఏటా జరుపుకోవడం ఆనవాయితీ. చిన్నాపెద్దా అనే తేడా లేకుండా అందరూ ఆనందోత్సాహాల నడుమ రంగులు చల్లుకుని ఆనందంగా గడిపారు. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకుని జీవితం సప్తవర్ణ శోభితం కావాలని ఆకాంక్షించారు.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



రాజాం: రాజాం పట్టణంలో హోలీ వేడుకల్లో పాల్గొన్న యువత



సంతకవిటి: ఆనందోత్సాహాల నడుమ హోలీ సంబరాలు చేసుకుంటున్న చిన్నారులు



రాజాం సిటీ: సోపేరులో హోలీ వేడుకలు జరుపుకుంటున్న చిన్నారులు



రేగిడి: వన్నలిలో హోలీ వేడుకల్లో భాగంగా రంగులు చల్లుకుంటున్న చిన్నారులు



బొబ్బిలిరూరల్: పిరిడిలో హోలీ సంబరాల్లో చిన్నారులు



తెర్లాంలో రంగుల పండగ జరుపుకుంటున్న ఎస్సీ కాలనీవాసులు



బొబ్బిలి: సరదాగా హోలీ సంబరాలు చేసుకుంటున్న కుటుంబ సభ్యులు



బాడంగి: మండల కేంద్రంలో హోలీ వేడుకల్లో యువత

కూటమివి బూటకపు హామీలు



మాట్లాడుతున్న పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాసరావు

రేగిడి: కూటమి ఇచ్చిన హామీలన్నీ బూటకమేనని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు విమర్శించారు. ఇదే విషయమై మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఎన్నికల సమయంలో 50 ఏళ్ల వయసు దాటిన బీసీలకు పింఛన్ అందిస్తామన్న హామీ ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఈ హామీయే కాదు వారిచ్చిన ఏ ఒక్క హామీ ఇప్పటివరకు పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. నామినేటెడ్ పదవుల పంపకాల్లోనూ బీసీల పట్ల చంద్రబాబు వివక్ష చూపారన్నారు. బీసీ నేతలకు ప్రాధాన్యత లేని పదవులు ఇచ్చి, అగ్రకులాల వారికి ప్రాధాన్యమున్న పదవులు కట్టబెట్టారన్నారు. సమావేశంలో లక్ష్మీపురం సర్పంచ్ కెంబూరు తేజోవతి పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సమావేశం



ఏపీఎంను నిలదీస్తున్న జీఎస్‌పురం సర్పంచ్ ఈశ్వరరావు

• ఏపీఎం పనితీరుపై సభ్యుల ధ్వజం

సంతకవిటి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సిరిపురపు మంజు అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. ఏపీఎం టి.దదికుమార్ పనితీరుపై సభ్యులు ధ్వజమెత్తారు. ఇందిరా క్రాంతి పథకం, డ్వాక్రా గ్రూపులు, స్వయం శక్తి సంఘాల పనితీరుపై జరిగిన సమీక్షలో వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు, కాకరాపల్లి సర్పంచ్ వావిలపల్లి రమణారావు కలుగజేసుకుని, తమ పంచాయతీలోని అక్కరాపల్లి గ్రామంలో ఎక్కువ గ్రూపులు కోరుకుంటున్న సీఏఫ్‌ను ఎందుకు కొనసాగించడం లేదని ఏపీఎంను ప్రశ్నించారు. ఇదే సమయంలో జీ.ఎస్.పురం సర్పంచ్ పప్పల ఈశ్వరరావు జోక్యం చేసుకుని తమ గ్రామంలో 2023లో గ్రూపు సభ్యులకు తెలియకుండా రూ.7.3 లక్షలు పక్కదోవ పట్టడంపై అప్పట్లో విచారణ చేపట్టిన అధికారులు సంబంధిత సీఎఫ్ నుంచి కొంత మొత్తం రికవరీ చేశారన్నారు. అప్పటి నుంచి విధులకు దూరంగా ఉంచిన సీఎఫ్‌ను ఎవరి అనుమతితో మీరు వచ్చాక కొనసాగిస్తారని విరుచుకుపడ్డారు. జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు స్పందిస్తూ గ్రామ సంఘం తీర్మానం లేకుండా సీఎఫ్‌ను కొనసాగించే హక్కు ఉందా.. అని ఏపీఎంను నిలదీశారు. అటువంటి హక్కు లేదని, సీఎఫ్‌ను తొలగిస్తానని ఏపీఎం తెలిపారు. అనంతరం తాగునీరు, బోరు మరమ్మతులపై జరిగిన చర్చలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సంతోష్ మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నామని, క్రాస్‌ప్రోగ్రాం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పాడైన తాగునీటి బోర్లను బాగు చేయడం జరుగుతోందన్నారు. ఏ గ్రామంలోనైనా బోర్లు బాగాలేకపోతే ఫోన్ నంబర్ 9441016661ను సంప్రదించాలన్నారు. విద్యాశాఖపై జరిగిన సమీక్షలో జీవో 117 ద్వారా పాఠశాలలను మెర్జ్ చేస్తామని సభకు తెలపడంతో జెడ్పీ వైస్ చైర్మన్ కలుగజేసుకుని పాఠశాలలను మెర్జ్ చేస్తే ఉపాధ్యాయ పోస్టులు ఎక్కడ ఖాళీ ఉంటాయని, ఈ లెక్కన మెగా డీఎస్సీ హామీ నిరుద్యోగులను దగా చేయడమే కదా అని అనడంతో ఎంఈవో సీహెచ్ భాస్కరరావు నీళ్లు నమిలారు. ఆ తర్వాత ఉపాధి హామీ పథకం పనులపై జరిగిన చర్చలో జీ.ఎస్.పురం చెరువుగట్టుపై ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ ఎలా నిర్మిస్తారని, గ్రామంలో కావాల్సినంత ప్రభుత్వ స్థలం ఉంచుకుని, సర్పంచ్‌కు తెలియకుండా చెరువుగట్టుపైనే ఆ నిర్మాణం ఎందుకు చేశారని సర్పంచ్ పి.ఈశ్వరరావు.. ఏపీవో ఆర్.హరనాథరావును నిలదీశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సురేష్‌కుమార్, తహసీల్దారు బి.సత్యం, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.రామకృష్ణ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన జరిగే ఈ సమావేశం 11 గంటలకు ఉంటుందని, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లంతా హాజరవుతారని, అధికారులంతా రావాలని కోరారు.

'స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర'ను విజయవంతం చేయండి

తెర్లాం: మండల కేంద్రంలో శనివారం నిర్వహించనున్న స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో రేగి రాంబాబు ఓ ప్రకటనలో శుక్రవారం కోరారు. ప్రతినెలా మూడో శనివారం చేపట్టే ఈ కార్యక్రమంలో భాగంగా నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ సంచులు వాడకుండా ప్రజలకు, విక్రయించకుండా వ్యాపారులకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ, వెలుగు సిబ్బంది అంతా హాజరుకావాలన్నారు.

కనులపండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

తెర్లాం: మండలంలోని గంగన్నపాడు గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవం కనులపండువగా శుక్రవారం నిర్వహించారు. ఏటా డోలా పౌర్ణమి సందర్భంగా కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని ఆలయ నిర్వాహకులు, గ్రామపెద్దలు కలిసి జరిపిస్తుంటారు. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామి కల్యాణోత్సవం తిలకించి, తరించారు.

బొబ్బిలి:వసంత పంచమి సందర్భంగా స్థానిక పట్టణంలో డోలా యాత్ర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేణుగోపాలస్వామి ఆలయంలోని మూలవిరాట్‌లను ఊరేగించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

బొబ్బిలి: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే బేబీనాయన చేతులమీదుగా శుక్రవారం అందజేశారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన 11 మందికి మొత్తం రూ.15 లక్షల నిధులు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

పెరుమాళి మోడల్ స్కూల్ స్థలదాత మృతి



పోతిన అక్కయ్యమ్మ(ఫైల్)

తెర్లాం: మండలంలోని పెరుమాళి గ్రామంలో గత కొన్నేళ్ల క్రితం నిర్మించిన ఏపీ మోడల్ స్కూల్‌కు అవసరమైన స్థలాన్ని దానం చేసిన స్థలదాత పోతిన అక్కయ్యమ్మ శుక్రవారం తెల్లవారుజామున విశాఖపట్నంలోని పీఎం పాలెంలో మృతి చెందారు. ఈమె సొంత గ్రామం విశాఖపట్నంలోని పీఎం పాలెం అయినప్పటికీ పెరుమాళిలో ఈమెకు భూములు ఉన్నాయి. పెరుమాళికి మోడల్ స్కూల్ మంజూరైనప్పుడు ప్రభుత్వ స్థలం లేకపోవడంతో రూ.లక్షలు విలువ చేసే తన సొంత స్థలాన్ని మోడల్ స్కూల్ నిర్మాణానికి అందజేశారు. ఈ మేరకు ఆమె మృతి పట్ల పెరుమాళి గ్రామస్తులు, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



రంగరాయపురం మలుపు వద్ద వాహనాలు కనిపించేలా ఏర్పాటు చేసిన అద్దం

బొబ్బిలిరూరల్: మండలంలోని రంగరాయపురంలో ప్రధాన రహదారిలోని మలుపు వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టారు. ఇదే దారిలో నిత్యం ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలతో పాటు ఆర్టీసీ బస్సులు, లారీలు తిరుగుతుంటాయి. అయితే మలుపు వద్దకు వస్తే గానీ అటువైపు నుంచి వచ్చే వాహనం కనిపించదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో బాడంగి మండలం, పాల్తేరుకు చెందిన వంగపండు రమేష్, అదే గ్రామానికి చెందిన మరొకరితో కలసి ఓ ఆలోచన చేశారు. ఆ మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు వాహనదారులకు కనిపించేలా ఓ అద్దాన్ని ఏర్పాటు చేశారు. గతంలో కన్నా ఇప్పుడు కొంచెం ఫర్వాలేదని స్థానికులు అంటున్నారు.

రాస్తారోకో



విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బొబ్బిలి చర్చి సెంటర్ వద్ద సీఐటీయూ(సెంట్రల్ ఇండియన్ ట్రేడ్ యూనియన్) ఆధ్వర్యంలో శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు మాట్లాడుతూ ఇటీవల స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం కేటాయించిన రూ.11,440 కోట్ల నిధులు.. ముడిసరుకు కోసమో.. లేక.. ఉద్యోగుల జీతభత్యాల కోసమో కాదని, అదంతా తర్వాతి కాలంలో స్టీల్‌ప్లాంట్ కొనుగోలు చేసే వారికి అప్పుల భారం ఉండకుండా ఇచ్చిన ప్యాకేజీ అని విమర్శించారు. గత కొన్నిరోజులుగా విశాఖ ఉక్కు కర్మాగారంలోని 5 వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించేందుకు యాజమాన్యం ప్రయత్నాలు చేస్తుండడం దుర్మార్గమన్నారు. ప్రకాశం, అనంతపురం జిల్లాల్లోని మర్లపాడు బ్లాక్‌లోని 77 మిలియన్ టన్నులు, కొనజేడు బ్లాక్‌లోని ఏడు మిలియన్ టన్నుల ఇనుప ఖనిజం నిల్వలను స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించాలని డిమాండ్ చేశారు. రూ.3 లక్షల కోట్ల విలువైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కారుచౌకగా అమ్మేస్తుంటే చంద్రబాబు ప్రభుత్వం కిమ్మనడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు భాస్కరరావు, శంకరరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు మణికుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

–బొబ్బిలి

కూటమి పాలనలో రైతుకు దగా



కూటమి పాలనలో రైతుకు దగా జరుగుతోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు నడిమింటి సత్యంనాయుడు విమర్శించారు. ఇదే విషయమై ఆయన రామభద్రపురం మండలం, నాయుడువలస గ్రామ రైతులతో కలిసి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి రాగానే ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ పేరిట ఏటా రూ.20 వేలు సాగుకు సాయం అందిస్తామని ఇవ్వడం లేదని, పాడైన పంటలకు పంటల బీమా కూడా చెల్లించడం లేదని, పండిన పంటకు సరైన మద్దతు ధర కల్పించడం లేదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు నమ్మి ఓట్లేసిన జనం, రైతులు ఇలా అన్నివర్గాల వారు మోసపోయారన్నారు. ఇప్పటికైనా ఎన్నికల హామీలు అమలు చేసి, ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని హితవుపలికారు. కార్యక్రమంలో రైతులు వై.శంకరరావు, కె.రామారావు, కె.పాపయ్య, సీహెచ్ ముసలినాయుడు, బి.నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

–రామభద్రపురం

వైభవంగా లక్ష పుష్పార్చన



బొబ్బిలిలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో లక్ష పుష్పార్చన పూజలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. రాజ్యలక్ష్మి అమ్మవారికి లక్ష మల్లెపువ్వులతో అర్చన చేసి, అమ్మవారి పట్ల తమకున్న భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. పుష్పాలంకరణలోని అమ్మవారిని చూసి తరించేందుకు భక్తులు పోటెత్తారు.

–బొబ్బిలి

అభినందనలు



జగన్మోహన్‌ను సత్కరిస్తున్న డీఎస్పీ రాఘవులు

రాజాం సిటీ: వంగర మండలం, మడ్డువలస కుడి ప్రధాన కాలువలోనికి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరి ప్రాణాలు కాపాడిన సంగాం గ్రామానికి చెందిన జెన్ని జగన్మోహన్‌ను చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు అభినందించారు. స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఆయనను దుశ్శాలువతో శుక్రవారం సత్కరించారు. ఇటీవల కింజంగి గ్రామానికి చెందిన కళింగ శ్రావణి తన ఇద్దరు చిన్నారులతో మడ్డువలస కుడి ప్రధాన కాలువలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం విధితమే. ఆ సమయంలో వీరిని గమనించిన జగన్మోహన్ శ్రావణితో పాటు ఆమె పిల్లలను కాపాడడం సాహసోపేతమేనని డీఎస్పీ అన్నారు. అనుకోని విపత్తులు సంభవించిన సమయంలో నష్ట నివారణకు యువకులు స్పందించాలని కోరారు. అంతకుముందు రూరల్ మండలాల సిబ్బందితో సమావేశం నిర్వహించి, క్రైమ్ రేటు తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావు, రాజాం, సంతకవిటి, వంగర, రేగిడి ఎస్ఐలు వై.రవికిరణ్, ఆర్.గోపాలరావు, షేక్ శంకర్, పి.నీలావతి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం



యువతకు దిశానిర్దేశం చేస్తున్న ఎస్ఐ ప్రసాదరావు

రామభద్రపురం: గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం, సిగరెట్ వంటి మత్తు పదార్థాలు తీసుకుంటే జీవితం నాశనం అవుతుందని ఎస్ఐ వి.ప్రసాదరావు హెచ్చరించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో యువతకు మంచి భవిష్యత్‌కు అనుసరించాల్సిన మార్గాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం యువత ఫ్యాషన్ మాయలో పడి చెడు అలవాట్లకు బానిసలై తమ జీవితాలు చెడగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ మంచి అలవాట్లు అలవర్చుకోవాలని, ఆదర్శవంతమైన జీవనం సాగించాలని కోరారు. అనంతరం సత్ప్రవర్తనతో మెలగుతామని యువతతో ప్రతిజ్ఞ చేయించారు.